## అర్హులందరికీ న్యాయం చేస్తాం

### సర్పంచ్ బుర్ర పోచయ్య



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ రూరల్:** ప్రజా పాలన గ్రామసభలో పెట్టుకున్న దరఖాస్తులకు అర్హులైన వారికి న్యాయం చేస్తామని రాజంపేట సర్పంచ్ బుర్ర పోచయ్య అన్నారు. శనివారం గ్రామపంచాయతీ ఆవరణలో 99 రోజుల ప్రజా పాలన గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభకు తహసిల్దార్ రియాజ్ అలీ, మిషన్ భగీరథ ఈ ఈ సిద్ధికి, ఎంపీడీవో, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు హాజరై ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా రాజంపేట సర్పంచ్ పోచయ్య మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. ప్రజల నుండి అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. రాజంపేట సమగ్ర అభివృద్ధి కి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు జావిద్ గులాం , గ్రామపంచాయతీ కార్యదర్శి సాయి, తదితరులు పాల్గొన్నారు.

## అదుపుతప్పి వ్యాను బోల్తా .....

### తప్పిన పెను ప్రమాదం



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండల కేంద్రంలోని నయారా పెట్రోల్ బంక్ ఎదురుగా శనివారం ఉదయం ఆగ్రా నుండి సిద్దిపేట కు వెళ్తున్న ఆలుగడ్డల లోడ్ ఐచర్ వ్యాన్ ప్రమాదానికి గురైంది. స్థానికుల కథనం ప్రకారం వేగంగా వస్తున్న ఐషర్ వ్యాన్ బంక్ ఎదురుగా నిలిచి ఉన్న లారీని మొదట ఢీ కొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ కు ఎలాంటి గాయాలు కాలేదు. సమీపంలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఉన్నను దానిని ఐచర్ వ్యాన్ తగలకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ మేరకు సంఘటన స్థలానికి తాండూర్ పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## బీరన్న దేవుడి ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో గల బీరన్న దేవుడి గుడి నిర్మాణానికి తాండూర్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎలుక రామ్ చందర్ సిమెంటు బస్తాలతో పాటు కొంత నగదును కమిటీ సభ్యులకు శనివారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కురుమవాడ సమీపంలో పెద్ద ఎత్తున ఆలయ నిర్మాణ పనులు చేపడుతుండడంతో కురుమ కుల సభ్యులందరూ కలిసి దాతల సహకారం కోరుతూ ఆలయ నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నారు. ఈ క్రమంలో ఎలుక రామచందర్ ను కొత్తపల్లి కురుమ సంఘం సభ్యులు సంప్రదించగా అడిగిన వెంటనే ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కొత్తపల్లి కురుమ సంఘం సభ్యులు ఎలుక రామచందర్ కు కృతజ్ఞతలు తెలిపారు.బీరన్న పండుగలోపు గుడి నిర్మాణ పనులు పూర్తి కానున్నాయని బీరన్న దేవుడి గుడి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## ఉత్సాహంగా కుమురం భీం జిల్లా నెట్ బాల్ జట్ల ఎంపిక



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాల మైదానంలో శనివారం సీనియర్ 'ఫాస్ట్ 5' నెట్ బాల్ మహిళా, పురుషుల జిల్లా జట్ల ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. నెట్ బాల్ జిల్లా చైర్మన్ అలీ బిన్ హైహ్మద్, సెక్రెటరీ బి. సురేఖల ఆధ్వర్యంలో ఈ క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఇక్కడ ఎంపికైన మహిళా, పురుషుల జట్లు ఈ నెల 21 నుండి 23 వరకు మహబూబ్నగర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ బి. తిరుపతి, జిల్లా కోచ్‌లు సి.హెచ్. ఏడుకొండలు, డి. శాలిని తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే రోగాలకు దూరం





- **మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండీ అహ్మద్**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** పరిసరాల పరిశుభ్రతతోనే వివిధ రకాల రోగాలకు దూరంగా ఉండవచ్చని ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండీ అహ్మద్ పేర్కొన్నారు. పట్టణంలోని 19వ వార్డులో మున్సిపల్ ఆధ్వర్యంలో శనివారం '99 రోజుల కార్యాచరణ'లో భాగంగా ప్రత్యేక వార్డు సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇళ్ల చుట్టుపక్కల ఎక్కడా చెత్తచెదారం వేయవద్దని, ముఖ్యంగా డ్రైనేజీలలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను పడేయడం వల్ల మురుగు నీరు నిలిచిపోయి దోమలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని తెలిపారు. వార్డులలో ప్రజలకు ఏ సమస్య ఉన్నా స్థానిక కౌన్సిలర్ల దృష్టికి తీసుకురావాలని, మున్సిపల్ యంత్రాంగం ద్వారా ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమం కోసం తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని వారు హామీ ఇచ్చారు. అనంతరం పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించేలా ఈ సమావేశానికి విచ్చేసిన ప్రజలకు మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి మొక్కలను అందజేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, కౌన్సిలర్లు చిలువేరు వెంకటేశ్వర్లు, సాలం బిన్ అహ్మద్, జేబా షేక్, విద్యుత్ శాఖ ఏఈ కే లక్ష్మీ రాజం, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు సాయి శ్రావణ్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత

- **ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి దయానంద్**



**ఉద్యమ కెరటం, కల్లూరు:** ఖమ్మం జిల్లా కల్లూరు మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామంలో మత్స్య శాఖ ఆధ్వర్యంలో మత్స్యకార సంఘ సభ్యులకు గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్ట రాగమయి దయానంద్ ముఖ్య అతిథిగా హాజరై, మత్స్యకారులకు గుర్తింపు కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి దయానంద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న విషయాన్ని ఆమె గుర్తుచేశారు. ఈ గుర్తింప కార్డుల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని మత్స్యకారుల అభివృద్ధికి అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోంది. లబ్ధిదారులందరూ ఈ గుర్తింపు కార్డులను సద్వినియోగం చేసుకోవాలి.ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మత్స్యకార సంఘ నాయకులు, సభ్యులు చంద్రుపట్ల గ్రామస్తులు పాల్గొన్నారు.

## భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కార్మిక సంఘం లోకి భారీగా చేరికలు



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండల ఆటో యూనియన్ నుంచి భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వేముల మారన్న, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు మహమ్మద్ హబీబ్ పాషా పాషా లు ఆటో కార్మికుల కోసం అనునిత్యం చేస్తున్న పోరాటాలను పరిగణలోకి తీసుకొని తాండూర్ మండల ఆటో యూనియన్ నుంచి భారీగా చేరికలు జరిగాయి. శనివారం భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ మంచిర్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నం శ్రీనివాసులు, బి ఆర్ టి యు మండల సలహాదారునిగా బండి చందు అచలాపూర్ ఆటో కార్మికుని నియమించడం జరిగిందన్నారు.సోషల్ మండల మీడియా ఇన్చార్జిగా శ్రీకాంత్ అచలాపూర్ అడ్డా ఆటో కార్మికుడు పోశం అచలాపుర ఆటో కార్మికుని ప్రచార కార్యదర్శిగా నియమిస్తూ నియామక పత్రాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి హబీబ్ పాష మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు నామీద ఉంచిన నమ్మకాన్ని మమ్ము చేయకుండా బి ఆర్ టి యు లో చేరిన కార్మికులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ అనునిత్యం ఆటో కార్మికుల కోసం పోరాటం చేస్తూ సంక్షేమ కూడా ఏర్పాటు అయ్యేవరకు అవసరమైతే ఆమరణ ఆమరణ నిరాహార దీక్షలు చేసైన ఆటో కార్మికుల హక్కుల సాధన కోసం ఐకమత్యంగా పోరాడి హక్కులు సాధిద్దామని దిశా నిర్దేశాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిర్యానీ ఆటో కార్మికులు లింగమూర్తి, సాగర్,రేచిని ఆటో కార్మికులు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలి

### ఏసీఎంఓ పూర్కా ఉద్ధవ్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:**బడి ఈడు పిల్లలందరూ తప్పనిసరిగా పాఠశాలల్లోనే ఉండాలని, బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పీఎంఆర్సీ ఏసీఎంఓ పూర్కా ఉద్ధవ్ పిలుపునిచ్చారు. ఆసిఫాబాద్ మండలంలోని పాడిబండ గ్రామ పంచాయతీ పరిధిలోని వట్టివాగు గ్రామంలో ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఆత్రం ఈశ్వరి దీనకర్, ఏసీఎంఓ పూర్కా ఉద్ధవ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీఎంఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రతి ఇంటికి వచ్చి బడి ఈడు పిల్లలను, అంగన్వాడీ పిల్లలను పాఠశాలల్లో నమోదు చేస్తారని తెలిపారు. ప్రభుత్వ గిరిజన ప్రాథమిక, ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన ఆంగ్ల మాధ్యమ విద్యతో పాటు గిరిజన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫాం, మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యం అన్నం అందిస్తూ ఆటపాటలతో కూడిన నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కుమరం మాధవరావు, ఎస్సీఆర్పీలు రాథోడ్ రవీందర్, కూడ్మేత అనంత్, మాజీ ఎంపీటీసీ ఉయిక శంకర్, ఆత్రం దీనకర్, పంచాయతీ సెక్రటరీ, అంగన్వాడీ కార్యకర్తలు, ఎస్.హెచ్.జి సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అటవీశాఖ అధికారులను అడ్డుకున్న పోడు రైతులు

- **తుమ్మలగూడలో తీవ్ర ఉద్రిక్తత**
- **దశాబ్దాలుగా సాగు చేస్తున్న భూమిలో కందకాలు తవ్వేందుకు వచ్చిన అధికారులు...**

**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండలంలోని తుమ్మలగూడ గ్రామంలో పోడు రైతులు, అటవీ శాఖ అధికారులకు మధ్య శనివారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పెంచూర్ ఇంచార్జి ఎఫ్ఆర్ఓ శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారులు రెబ్బెన శివారులో కందకలు తవ్వడానికి ట్రాక్టర్లతో వెళ్లారు. దశాబ్దాలుగా తాము సాగు చేసుకుంటున్నా పోడు భూములను అటవీ అధికారులు కందకాలు తవ్వడం సమంజసం కాదని రైతులు తెలిపారు. ఈ భూమిని నమ్ముకుని జీవిస్తున్న తమకు ప్రతి సంవత్సరం వర్షాకాలం వచ్చిందంటే అటవీ శాఖ అధికారులకు రైతులకు మధ్య రగడ తప్పదని తెలుపుతున్నారు. ఈ ఏడాది బెజ్జూర్ రేంజ్ పరిధిలోని రెబ్బెన శివారులో సర్వే నెంబర్ 96లో 237 ఎకరాల భూమిలో 80 మంది రైతులు సాగు చేసుకుంటున్నారు. ఈ భూమికి 2010 సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పోడు రైతులకు పట్టాలిచ్చిందన్నారు. అనంతరం పోడు భూముల్లో త్రీఫేజ్ కరెంట్ లైన్, 9 బోర్లు వేసి 40 సంవత్సరాలుగా తమ భూములను సాగు చేసుకుంటున్నామని తెలిపారు. విషయం తెలుసుకున్న తుమ్మలగూడెం సర్పంచ్ కొండ రాంప్రసాద్ రైతులతో కలిసి బెజ్జూర్ రేంజ్ అటవీ అధికారులను అడ్డుకున్నారు. 40 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూముల్లో అధికారులు



కందకాల తీయడం ఎంతవరకు సమంజసమని రైతులకు అన్యాయం జరుగుతుందని సర్పంచ్ రాంప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తను సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలిచ్చిందని కందకాలు తాగడం అన్యాయం అన్నారు. అటవీ శాఖ అధికారుల వద్ద ఏం ఆధారాలున్నాయని, కందకాలు తవ్వేందుకు వచ్చారని ప్రశ్నించారు. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# ఎన్నికల విజయానికి బీఎల్ఏలే బలమైన సైన్యం

**డీసీసీ జిల్లా అధ్యక్షురాలు ఆత్రం సుగుణ**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** ఎన్నికల ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీ ఏల్ ఏ లు) కీలక పాత్ర పోషిస్తారని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ అన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఆసిఫాబాద్ పట్టణంలోని ఓడ్డేపల్లి గార్డెన్‌లో నిర్వహించిన బీఎల్‌ఏల ప్రత్యేక శిక్షణా కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూ ఓటరు జాబితాల పరిశీలన, సవరణలు, కొత్త ఓటర్ల నమోదు, ఎన్నికల నిబంధనలు తదితర అంశాలపై ప్రతి బీఎల్ఏ పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పార్టీ బలోపేతం, ఎన్నికల సన్నద్ధతలో భాగంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణా కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో పార్టీకి మరింత బలం చేకూరుస్తాయని పేర్కొన్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా హాజరైన మోహన్, నరేష్ రాథోడ్ లు బీఎల్ఏలకు ప్రత్యేక శిక్షణ అందించారు. ఎన్నికల సంఘం నిబంధనలు, ఓటరు జాబితా నిర్వహణ, బూత్ స్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై వారు సవివరంగా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి



అజ్మీర శ్యామ్ నాయక్, మాజీ డిసిసి అధ్యక్షులు విశ్వ ప్రసాద్ రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జిల్లా గ్రంథాలయం చైర్మన్ అనిల్ కుమార్, డీసీసీ కార్యవర్గ సభ్యులు తారిక్, భీమ్రావు, గాదెవేణి మల్లేష్, విజయ్, శోభన్, యూత్ కాంగ్రెస్ నాయకుడు కమల్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సభల ద్వారా సమస్యల పరిష్కారానికి చర్యలు

**అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య**

**ఉద్యమ కెరటం,మంచిర్యాల:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక గ్రామ సభల ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య తెలిపారు. శనివారం బెల్లంపల్లి మండలం పెర్కపల్లి గ్రామపంచాయతీలో నిర్వహించిన ప్రత్యేక గ్రామ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాల సన్నద్ధత, సురక్షిత తాగునీరు, ప్లాస్టిక్ నిషేధం, వన మహోత్సవం, ఓటర్ల జాబితా సవరణ, వరద నిర్వహణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలోని మురుగు కాలువలు, అంగన్వాడీ భవన నిర్మాణం, విద్యుత్ సమస్యలను క్షేత్రస్థాయిలో



పరిశీలించి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మోసపోతే వెంటనే '1930' నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

**అమృత్ 2.0 పనుల పరిశీలన:**

అనంతరం బెల్లంపల్లి పట్ట ణంలో నిర్మాణంలో ఉన్న నూతన నీటి శుద్ధి కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. బెల్లంపల్లి ప్రాంత ప్రజల తాగునీటి అవసరాల కోసం అమృత్ 2.0 పథకం కింద రూ. 63 కోట్లు మంజూరయ్యాయని, ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి వేదాల శ్రీనివాస్, సర్పంచ్ జరుపుల సాయికిరణ్, ఏఎస్ఐ బాబాజీ, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్ఎస్పి పిలుపుతో..

- **నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం**

**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** మండలం భట్టిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సి.బాబు కాలనీ 12వ వార్డుకు చెందిన మొహమ్మద్ షఫీ, తబ్బుసం బేగం దంపతుల కుమార్తె వివాహానికి శనివారం పలువురు నాయకులు ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ టౌన్ మాజీ కౌన్సిలర్ మినాజ్ బాధిత కుటుంబానికి 75 కిలోల బియ్యంతో పాటు వంట ఖర్చుల నిమిత్తం రూ.2,000 నగదు సహాయాన్ని అందజేశారు. అలాగే, చెట్టి వెంకటేష్ వివాహ ఖర్చుల కోసం మరో రూ.2,000 నగదు సహాయం అందించి తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ఈ సందర్భంగా నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, మినాజ్, చెట్టి వెంకటేష్‌లకు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, సి.బాబు కాలనీ వాసులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ సేవలను ఈ సందర్భంగా వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు అయ్యిల్లా శంకర్, మారుబోయిన డేవిడ్ రాజ్, మొహమ్మద్ ఆఫ్తాబ్, అంగుళూరి చల్మయ్య, ఎం.డి. తాజ్, యువకులు మొహమ్మద్ అక్రమ్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.



# ఆకాంక్షిత బ్లాక్ లో విద్య అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి



- **జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్**

**ఉద్యమ కెరటం, తిర్యాణి :** జిల్లాలోని ఆకాంక్షిత బ్లాక్ తిర్యాణి మండలంలో విద్య అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. శనివారం జిల్లా విద్యాధికారి సచ్చిదానంద చారి, మండల విద్యాధికారి లతో కలిసి జిల్లాలోని తిర్యాణి మండలంలో ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మాణిక్యపూర్ లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం లను సందర్శించి పాఠశాలలలోని తరగతి గదులు, త్రాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఆదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్య అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో ఆకాంక్షిత బ్లాక్ లోని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇంటర్‌ఆక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ పనితీరును పరిశీలించి సమర్థవంతమైన వినియోగంపై సిబ్బందికి సూచనలు చేశారు. పాఠశాలల అభివృద్ధి, సదుపాయాల మెరుగుదల, డిజిటల్ బోధన పద్ధతుల అమలుపై అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లఖంపూర్ (జి)లో ఘనంగా గ్రామ సభ నిర్వహణ



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** నేరడిగొండ మండలంలోని లఖంపూర్ (జి) గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ సెడ్మకి సుజాత గంగాధర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల ప్రాధాన్యతపై గ్రామస్తులతో చర్చించారు. గ్రామంలో చేపట్టిన పనులు, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సభలో సమగ్రంగా చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రెంగే పూజా, గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీల్ కుమార్, సి.సి. చంద్రకళ, అంగన్‌వాడీ టీచర్లు గోదావరి, శ్రీలత, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# బ్రెయిన్ స్ట్రోక్‌తో బెటాలియన్ కానిస్టేబుల్ మృతి



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి మండలంలోని గంగారం 15వ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ తాటి నాగార్జున (39) బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. వివరాల ప్రకారం, ఈ నెల 2వ తేదీన ఆయన తీవ్ర అస్వస్థతకు గురికాగా, బెటాలియన్ అధికారులు వెంటనే ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శనివారం కన్నుమూశారు. నాగార్జున మృతితో 15వ బెటాలియన్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన స్వగ్రామమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం భీమునిగూడెంలో కూడా తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు, బంధువులు ఆయన మృతిని జీర్ణించుకోలేక కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సహచర ఉద్యోగులు, గ్రామస్తులు నాగార్జున మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారం

**డిఎఫ్ఓ ని కలిసిన సర్పంచ్ ఆడే శీల**




**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** గుడిహత్నూర్ గ్రామపంచాయతీ పరిధిలో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు ఉన్న అటవీ భూమి సమస్య ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. శనివారం గుడిహత్నూర్ సర్పంచ్ ఆడే శీల, ఆదిలాబాద్ జిల్లా అటవీ శాఖాధికారి (డీఎఫ్ఓ) బాజీరావు పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. డంపింగ్ యార్డ్‌కు ఎదురవుతున్న ఇబ్బందులను సర్పంచ్ వివరించగా.. డిఎఫ్ఓ సానుకూలంగా స్పందించి తక్షణమే అనుమతులు మంజూరు చేశారు. దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించినందుకు డిఎఫ్ ఓ కి సర్పంచ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మచ్చపూర్ సర్పంచ్ రాథోడ్ ప్రతాప్, కాంగ్రెస్ యువ నాయకుడు ఆడే జైపాల్, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల కు ఘనంగా సన్మానం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ :** ఇటీవల బదిలీ పై మండలానికి వచ్చిన పలువురు రెవిన్యూ, పంచాయతి రాజ్ శాఖ అధికారులను మండల సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ఆయా కార్యాలయాల్లో ఇంచార్జి ఎంపీడీవో రమేష్, అలాగే తహసీల్దార్ కలీం,నూతనంగా బాధ్యతలు చెప్పట్టిన ఆర్ఐలు సాయిరాం, మమత,లను సర్పంచులు కలసి శాలువలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల ఆమలులో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘ ప్రధాన కార్యదర్శి ఆడెపు శ్రీకాంత్, బుద్దికొండ సర్పంచ్ మహేందర్ రెడ్డి,బోరిగాం సర్పంచ్ వినేష్, నాయకులు బైరి రాజేందర్, నవీన్, గోడం అమృత్, చంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



# పశువైద్య శాఖలో పలువురు అధికారుల బదిలీలు

**ఉద్యమ కెరటం, నేరడిగొండ :** పశుసంవర్ధక శాఖలో సాధారణ బదిలీల ప్రక్రియలో భాగంగా పలువురు వెటర్నరీ అసిస్టెంట్లు, పశువైద్యాధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా, బదిలీ అయిన అధికారులు తమ కొత్త బాధ్యతలను స్వీకరించిన్నట్లు మండల పశు వైద్యాధికారి జీవన్ రాథోడ్ శనివారం పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ఇచ్చోడ మండల ప్రాథమిక పశువైద్య కేంద్రంలో పనిచేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ సంధ్య నేరడిగొండ మండల ప్రాథమిక పశువైద్య కేంద్రానికి బదిలీపై రాగా, అక్కడ పనిచేస్తున్న డాక్టర్ గోవింద్ నాయక్ వాంకిడి ప్రాథమిక పశువైద్య కేంద్రానికి బదిలీ అయ్యారు. నేరడిగొండలో పనిచేసిన పశువైద్యాధికారి డాక్టర్ సుశీల్ సోనాల మండల కేంద్రంలోని ప్రాథమిక పశువైద్య కేంద్రానికి వెళ్లారు.అదేవిధంగా మామడ మండలంలోని తాండ్ర సబ్ సెంటర్లో లైవ్ స్టాక్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న చంద్రశేఖర్ వాంకిడి ప్రాథమిక పశువైద్య కేంద్రానికి బదిలీపై రావడం జరిగింది. వాంకిడిలో పనిచేస్తున్న లైవ్ స్టాక్ అసిస్టెంట్ అరుణ్ అదిలాబాద్ కేంద్రానికి బదిలీపై వెళ్లినట్లు వెళ్ళడించారు.

# శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ భూముల కౌలు హక్కుల వేలం

## ఈ నెల 11న బహిరంగ వేలం

## ఆలయ మేనేజర్ పీవీ రమణ

**ఉద్యమ కెరటం, వేంసూర్ :**
వేంసూర్ మండలంలోని కందుకూరు గ్రామంలో వెలిసిన శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన భూముల కౌలు హక్కుల బహిరంగ వేలం పాటలను ఈ నెల 11వ తేదీ గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ పీవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానం హక్కు భుక్తంలో ఉన్న మొత్తం 352 ఎకరాల భూమిని 26 ప్లాట్లుగా విభజించి, ఉదయం 11 గంటల నుంచి దేవాలయ ప్రాంగణంలో దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో ఈ బహిరంగ వేలం పాటలను నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ వేలం పాటల్లో పాల్గొనదలిచిన వారు రూ. 25,000 ధరావత్తు సొమ్మును ముందుగా చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నిర్దేశిత సమయానికి ఆలయ ప్రాంగణానికి చేరుకుని వేలంలో పాల్గొనాలని సూచించారు. ఖమ్మం జిల్లా పరిధిలోని ఆసక్తి గల రైతులు, కౌలుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆలయ యాజమాన్యం కోరింది. మరిన్ని వివరాలకు ఆలయ కార్యాలయంలో సంప్రదించవచ్చని మేనేజర్ పీవీ రమణ తెలిపారు.

# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నాం

## జిల్లా కలెక్టర్ రాజర్షి షా




**ఉద్యమ కెరటం, అదిలాబాద్ టౌన్ :** మరో రెండు రోజుల్లో రుతుపవనాలు రానున్న నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లాలో మిగిలి ఉన్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని వివరించారు.అలాగే జూన్ 9న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే మండల మహిళా సమాఖ్యల ఆర్టీసీ బస్సుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా నుండి లబ్ధి దారులను తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్ ఎస్ చిత్రు, ఏఎస్పీ మౌనిక, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని అవగాహన



**ఉద్యమ కెరటం,సరంపల్లి:**
కామారెడ్డి మండలం సరంపల్లి గ్రామంలో శనివారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో గడపగడపకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు.ప్రధానోపాధ్యాయులు సాయిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు సేవలందిస్తున్నారని, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ గంగాధర్ రావు, ఉపాధ్యాయులు ప్రభాకర్, రవి, గోపాల్, రామకృష్ణ, సీఆర్పీ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

## జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక ఉచిత నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిం చడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. జి ఎం ఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో మార్కెట్ అవసరాలకు అనుగుణంగా జిల్లాలోని అర్హులైన నిరుద్యోగులకు హైదరాబాద్ లో 3 నెలల ప్రత్యేక ఉచిత నైపుణ్య శిక్షణ, ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. డ్రైవాల్ & ఫాల్స్ సీలింగ్ టెక్నీషియన్, వెల్డింగ్ & ఫ్యాబ్రికేషన్ టెక్నీషియన్, ఆటోమొబైల్స్ & టూవీలర్ టెక్నీషియన్, రిఫ్రిజిరేషన్ & ఎయిర్ కండిషన్ టెక్నీషియన్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఎక్స్కవేటర్ ఆపరేటర్, గెస్ట్ సర్వీస్ అసోసియేట్ (ఎఫ్ & బి), ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ (యువతులకు మాత్రమే) కోర్సులు అందించడం జరుగుతుందని, అభ్యర్థులు 3 ఆధార్ కార్డు ప్రతులు, రేషన్ కార్డు, పాస్పోర్ట్ సైజు ఫోటో, విద్యార్హత ధ్రువపత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. జైనూర్, సిర్పూర్ - యు, లింగాపూర్ మండలాలకు చెందిన అభ్యర్థులకు జైనూర్ మండల కేంద్రంలోని కె.ఆర్.కె. ఫంక్షన్ హాల్ లో ఈ నేల 9వ తేదీ ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు, కెరమెరి మండలానికి చెందిన అభ్యర్థులకు కెరమెరి మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఈ నెల 9వ తేదీన మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు, తిర్యాణి మండలానికి చెందిన అభ్యర్థులకు తిర్యాణి మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఈ నెల 10వ తేదీన ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు అర్హులైన నిరుద్యోగ యువతీ యువకుల నుండి దరఖాస్తుల స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా కార్యక్రమాన్ని రూపకల్పన చేయడం జరిగిందని, జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# తెలంగాణ ఉద్యమకారుల హామీ నిలబెట్టుకోవాలి

- తెలంగాణ ఉద్యమకారుల వేదిక నియోజకవర్గ ఇన్చార్జి నాగేష్
- ఉద్యమకారుల వేదిక సభ్యత్వ నమోదు ప్రారంభం

**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నిలబెట్టుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక సిర్పూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ నాగేష్ డిమాండ్ చేశారు. శనివారం బెజ్జూర్ మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల వేదిక సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నాగేష్ మాట్లాడుతూ మలిదశ ఉద్యమంలో లాఠీదెబ్బలు తిన్నాం, జైళ్లకు వెళ్లాం, కేసులు ఎదుర్కొన్నాం. రాష్ట్రం వచ్చినా నిజమైన ఉద్యమకారులకు నేటికీ గుర్తింపు దక్కలేదన్నారు. ప్రభుత్వం వెంటనే అర్హులైన ప్రతి ఉద్యమకారుడికి గుర్తింపు కార్డులు, పెన్షన్, ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలి" అని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు హామీల ప్రకారం ఉద్యమకారులను ఇంటి స్థలాలు ఇండ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షులు లింగయ్య మాట్లాడుతూ ఉద్యమకారులంతా వర్గాలకు అతీతంగా ఏకం కావాలని పిలుపునిచ్చారు. హక్కుల సాధన కోసం జిల్లావ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ఉద్యమకారుల వేదిక బలోపేతం ద్వారానే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి న్యాయం పొందగలమని అన్నారు. త్వరలో జిల్లాలోని అన్ని మండలాల్లో సభ్యత్వ నమోదు పూర్తి చేసి, కేశవరావు కమిటీకి నివేదిక అందజేస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి తెలంగాణ జావిద్, ఉపాధ్యక్షులు కుమ్మరి లింగయ్య, ఊసల బోయిన ఎర్రయ్య, పలువురు ఉద్యమకారులు, వేదిక సభ్యులు పాల్గొన్నారు.



# భారత సైన్యానికి ఎంపికైన యువకుడికి గ్రామపంచాయతీ ఘన సన్మానం


**ఉద్యమ కెరటం,రాజంపేట**
రాజంపేట మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన యువకుడు మాడుగుల తేజ యాదవ్ భారత సైన్యంలో (ఇండియన్ ఆర్మీ) సోల్జర్ జీడీ విభాగానికి ఎంపిక కావడంతో గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో శనివారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తేజ యాదవ్‌ను కాషాయ కండువాతో సత్కరించి అభినందన జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ కఠోర శ్రమ, పట్టుదలతో భారత సైన్యంలో స్థానం సంపాదించడం గ్రామానికి గర్వకారణమని పేర్కొన్నారు. దేశ సేవ కోసం సైన్యంలో చేరుతున్న తేజ యాదవ్ యువతకు ఆదర్శంగా నిలుస్తాడని కొనియాడారు.గ్రామ సర్పంచ్ పట్లే రోజ కృష్ణారావు మాట్లాడుతూ, "దేశ రక్షణ బాధ్యతలను నిర్వర్తించేందుకు సిద్ధమవుతున్న తేజ యాదవ్ మన గ్రామ ఖ్యాతిని మరింత పెంచాడు. అతని సైనిక జీవితం విజయవంతంగా సాగాలని, భరతమాత సేవలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాం" అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దొడ్లే అన్వేష్, పంచాయతీ కార్యదర్శి సౌందర్య, వార్డు సభ్యులు సంజీవ్, వినోద్, ప్రేమ్ కుమార్, హరీష్, గ్రామస్తులు వెంకట్, రమేష్, గణేష్, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు. దేశ రక్షణలో



భాగస్వామి కాబోతున్న గ్రామ యువకుడికి గ్రామ ప్రజలు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు.

# డీసీ సార్ డంపింగ్ యార్డ్ సమస్య కనిపిస్తుందా..?





- ఆకుల సతీష్
- రూ.5 కోట్లు ఖర్చైనా చెత్త సమస్యకు చెక్ ఎక్కడ..?
- డంపింగ్ యార్డ్ దుర్వాసనతో కాలనీవాసుల ఆందోళన

**ఉద్యమ కెరటం,కుత్బుల్లాపూర్**
నిజాంపేట్ డంపింగ్ యార్డ్ సమస్యను మున్సిపల్ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ తీవ్ర విమర్శలు చేశారు. జవహర్‌నగర్‌కు చెత్త తరలింపునకు ప్రతి ఏడాది సుమారు రూ.5 కోట్లు ఖర్చు చేస్తున్నప్పటికీ, రోజువారీ చెత్తను సకాలంలో తరలించకపోవడంతో రోడ్లపై చెత్త పేరుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.డంపింగ్ యార్డ్ సమీపంలోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీల ప్రజలు దుర్వాసన, కాలుష్యంతో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత ఐదేళ్లుగా స్థానికులతో కలిసి అనేకసార్లు ఆందోళనలు, వినతిపత్రాలు ఇచ్చినా సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకలేదని ఆవేదన వ్యక్తం చేశారు.డంపింగ్ యార్డ్‌ను వెంటనే ఇతర ప్రాంతానికి తరలించాలని, అది సాధ్యం కాకపోతే శాస్త్రీయ విధానంలో చెత్త ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసి ప్రతిరోజూ ఉత్పత్తి అయ్యే 180 టన్నుల చెత్తను అదే రోజు తరలించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సీఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్ తక్షణమే జోక్యం చేసుకుని ప్రజలకు ఉపశమనం కలిగించేలా శాశ్వత పరిష్కారం చూపాలని ఆకుల సతీష్ కోరారు.

# కీసర మండల సిపిఎం కార్యదర్శి బంగారు నర్సింగ రావు

**ఉద్యమ కెరటం,కీసర**
హమాలీ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇచ్చి హెల్త్ ఇన్సూరెన్స్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి... ధాన్యం కొనుగోలను మరింత వేగవంతం చేసి హమాలీలకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలనీ రైతుల హమాలీల సమస్యలు పరిష్కరించాలనీ కీసర మండల సిపిఎం కార్యదర్శి బంగారు నర్సింగ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కీసర రైతు వేదిక గ్రామ ఐకెపి వద్ద కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులు, హమాలిలు ఎదుర్కొంటున్న సమస్యను అడిగి తెలుసుకోవడం జరిగింది. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కీసర అధికారి నరహరిని కలిసి ధాన్యం కొనుగోలు పై వివరణ కోరడం జరిగింది దీనిపై ధాన్యం కొనుగోలు అధికారి నరహరి స్పందిస్తూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉందని ఎలాంటి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేదని తెలియజేశారు ఇప్పటికే రైతులకు 40,000 కోన సంచులను పంపిణీ చేయడం జరిగింది 25 వేల గోన సంచులు మాత్రమే కొనుగోలు కేంద్రానికి తిరిగి రావడం జరిగింది ఇంక 17,000 కొనసంచులు రైతుల వద్దనే ఉన్నాయన్నారు. మిల్లర్ యాజమాన్యం జాప్యం వల్ల కొంత రైతులకు ఇబ్బంది కలుగుతుంది అనేది వాస్తవం దాన్ని అధిగమించే ప్రయత్నం చేస్తామన్నారు.ఈ సందర్భంగా సిపిఎం కీసర మండల కార్యదర్శి బంగారు నర్సింగ రావు మాట్లాడుతూ... ఈ సంవత్సరం వరి సాగు విస్తీర్ణం పెరగడం వల్ల వాతావరణం అనుకూలించి వరి పంట దిగుబడులు పెరిగినందున పెరిగిన వరి ధాన్యం దిగుబడుల ను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం వల్ల రైతులకు, హమాలీ కార్మికులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని రైతులకు మార్కెట్లో వసతులు లేక మార్కెట్కు తెచ్చిన వరి ధాన్యాన్ని లారీల, గోనెసంచుల కొరత వల్ల సకాలంలో కాంటాలు పెట్టకపోవడం రైతులు ఇబ్బంది పడుతున్నారూ. ఒక్కో రైతు తమ ధాన్యాన్ని మార్కెట్కు తెచ్చి 20 రోజు పాటు ఎదురుచూడాల్సి వస్తుందని లారీల కొరత , గోనె సంచుల కొరత ముఖ్యంగా కొట్టొచ్చినట్టు కనబడుతున్నాయని ప్రభుత్వానికి ఏమాత్రం ముందు చూపు లేకుండా వ్యవహరిస్తున్నారని అదేవిధంగా హమాలీ కార్మికులు 45 డిగ్రీల ఎర్రటి ఎండలో కష్టపడి పని చేస్తున్నప్పటికీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడంలేదని హమాలీ కార్మికులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇచ్చి వారికి ఆరోగ్య సౌకర్యాన్ని, బీమా సౌకర్యాన్ని కల్పించేందుకు కృషి చేసి హమాలీలను ప్రోత్సహించాలని, ధాన్యాన్ని మొత్తంగా బి గ్రేడ్ ధాన్యంగా మిల్లుకు పంపుతున్నప్పటికీ వరి ధాన్యంలో తాలు ఉన్నదనే పేరుతో ఎక్కువ మొత్తంలో రైస్ మిల్లు యజమానులు కటింగులు చేస్తున్నారని ఈ విధానం సరైంది కాదని రైతులను ఇబ్బంది పెట్టకుండా మిల్లర్ల పై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

